- సీఎం గారూ.. ఇవి కాళేశ్వర జలాలే..

అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటిపారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు గురువారం నియామక పత్రాల అందజేత సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో రాజీపడితే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సీఎం ఆరోపణలు అబద్ధమని చెప్పే దృశ్యం సైతం గురువారం ఆవిష్కృతమైంది. నిలబడని ప్రాజెక్టు అన్న కాళేశ్వరం నుంచి ఎదురెక్కిన జలాలు మల్లన్నసాగర్‌ను నింపి, కిందికి రావడంతో నీటితోయాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు మత్తడి దుంకింది. **- ఆలేరు రూరల్**

వికారాబాద్ జిల్లా పరిగిలో మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

మెడకు ఉరితాళ్లతో కాంట్రాక్టర్ల నిరసన

- పెండింగ్ బిల్లుల కోసం పరిగి పట్టణంలో ఆందోళన
- బిల్లులు రాకపోతే ఆత్మహత్యే శరణ్యమంటున్న కాంట్రాక్టర్లు

పరిగి, సెప్టెంబర్ 26 : 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు గురువారం వికారాబాద్ జిల్లా పరిగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. మెడకు ఉరితాళ్లు వేసుకొని వినూత్న నిరసన చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద పనులు చేపట్టి ఏడాది గడిచినా బిల్లులు చెల్లించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లుల కోసం వినతిపత్రాలు అందజేసినా స్పందించకపోవడంతో ఉరి తాళ్లతో నిరసన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. బంగారం తాకట్టు పెట్టి, అప్పులు చేసి పనులు చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని, లేకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమని అన్నారు.

నటుడు అభిషేక్ అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ సరఫరా ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ నటుడు అభిషేక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో ఇప్పటికే ఆయనపై ఎస్సార్‌నగర్, జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా తప్పించుకొని తిరుగుతున్న అభిషేక్.. గోవాలో రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడనే సమాచారంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్టు చేసి గురువారం హైదరాబాద్‌కు తరలించారు.

దుబ్బాకలో ప్రొటోకాల్ రగడ

- 'కల్యాణలక్ష్మి' పంపిణీలో రసాభాస
- కాంగ్రెస్ నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మధ్య వాగ్వాదం
- పోలీసులపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

దుబ్బాకలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో సభావేదికపైకి వచ్చిన దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మధ్య వాగ్వాదం

దుబ్బాక, సెప్టెంబర్ 26: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. సభావేదికపై పాటించాల్సిన ప్రొటోకాల్ అంశంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్‌ను పాటించకుండా కాంగ్రెస్ నాయకులు కొందరు సభావేదికపైకి రావడంతో గొడవ తలెత్తింది. దుబ్బాకలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. మంత్రి సురేఖకు స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంత్రిని దుబ్బాక చేనేతల నూలు దండతో సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని సభావేదికపైకి ఆహ్వానించడంతో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు అభ్యంతరం తెలిపాయి. దీంతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించాలని, ఇది పార్టీ కార్యక్రమం కాదని అధికారులకు సూచించారు. సభా వేదికపై నుంచి కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వెళ్లకపోతే బీఆర్ఎస్ నాయకులు సైతం వేదికపైకి వస్తారని అధికారులకు చెప్పారు. దీంతో వేదికపైనే ఉన్న కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు హోరాహోరీగా నినాదాలు చేశారు. సభా ప్రాంగణం వద్ద తోపులాట జరిగింది. మరో పక్క ఉన్న బీజేపీ శ్రేణులు నినాదాలు చేయడంతో కల్యాణలక్ష్మి కార్యక్రమం రసాభాసగా మారింది. ఉద్రిక్తత పరిస్థితుల మధ్యే మంత్రి సురేఖ ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. నాయకుల నినాదాలు, తోపులాటతో కార్యక్రమానికి వచ్చిన లబ్ధిదారులు ఒకింత భయాందోళనకు గురయ్యారు.

పంపుసెట్ల విద్యుదీకరణ పథకానికి శ్రీకారం

508.95 కోట్ల కేటాయింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ వ్యవసాయ పంపుసెట్ల విద్యుదీకరణ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ. 508. 95కోట్లు కేటాయించింది. గురువారం పాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, సరూర్‌నగర్, మెదక్, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, నారాయణ్‌పేట్, రాజేంద్రనగర్, గద్వాల, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లను విద్యుదీకరిస్తారు. ఈ స్కీం కింద 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నాలుగు 5హెచ్‌పీ పంపుసెట్లకు కనెక్షన్ ఇస్తారు, ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 4 మోటార్లకు కనెక్షన్ ఇవ్వాలంటే కేవీ కండక్టర్, ఎల్‌టీ కేబుల్, పోల్స్ ఇతరత్రా ఏర్పాటుకు 3 లక్షలు ఖర్చవుతుంది. ఒక్కో పంపుసెట్‌కు 75 వేల చొప్పున వెచ్చించాలి.

దేశవ్యాప్తంగా ఓపీఎస్ అమలుచేయాలి

ఎన్ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపీఎస్) అమలుచేయాలని, సోమనాథన్ కమిటీ రిపోర్టును బహిర్గతపర్చాలని ఎన్ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్ఎంవోపీఎస్) ఆధ్వర్యంలో ఆగస్టు 24న కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని(యూపీఎస్) వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్తంగా పెన్షన్ ఆక్రోశ్ మార్చ్ పేరిట నిరసనలు తెలిపారు. తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని బీమా భవన్‌లో నిర్వహించిన నిరసనలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సందీప్, రెడ్డప్ప, మదన్‌రాజ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం?

- అఖిలపక్షం భేటీలో సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో డీజేల వినియోగంపై నిషేధం విధించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఫిర్యాదుల నేపథ్యంలో మతపరమైన ర్యాలీల్లో డీజేలు, పటాకుల వాడకంపై అభిప్రాయాలను తెలుసుకునేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ప్రతినిధులు, మత సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో డీజేలు, పటాకుల వినియోగం తగ్గించేలా చర్యలు చేపడతామని చెప్పారు.

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ ఇంటి ఎదుట వీరంగం సృష్టిస్తున్న కాంగ్రెస్ నేత ప్రవీణ్ అనుచరులు

బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద కాంగ్రెస్ వీరంగం

- దాడికి యత్నించిన అధికార పార్టీ నేత అనుచరులు
- చంపుతామంటూ బెదిరింపులు.. ఇరువురి మధ్య తోపులాట
- మహబూబాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

బయ్యారం, సెప్టెంబర్ 26: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు, కస్తూరినగర్ మాజీ సర్పంచ్ కృష్ణకుమారి భర్త మురళీకృష్ణ ఇంటిపై బుధవారం రాత్రి కాంగ్రెస్ గూండాలు దాడికి యత్నించారు. మండల కేంద్రంలోని సీఎంసీ స్థలం ఆక్రమణ విషయమై బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన తెలుపగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిని నిరసిస్తూ గంధంపల్లి సెంటర్‌లో ఆందోళన చేపట్టడంతో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి ప్రవీణ్‌నాయక్ అనుచరులు మురళీకృష్ణ ఇంటికి వెళ్లి వీరంగం సృష్టించారు. నీ భర్తను చంపుతామంటూ భార్య కృష్ణకుమారిని బెదిరించారు. ఇంతలో మురళీకృష్ణతోపాటు బీఆర్ఎస్ శ్రేణులు చేరుకోగా ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం, తోపులాట జరిగింది. 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు. తన భర్త మురళీకృష్ణకు కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌నాయక్, అనుచరులు గోవర్ధన్, మదన్, రాంబాబు, పుల్లయ్యతో ప్రాణహానీ ఉందని కృషకుమారి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాత గణేశ్, పలువురు నాయకులతో కలిసి ఎస్పీ రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావుకు ఫిర్యాదు చేశారు.

జోగిపేటలో యశ్వంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పీఏసీఎస్ చైర్మన్‌పై కాంగ్రెస్ దాడి

- మంత్రి దామోదర ఇలాకాలో కార్యకర్తల గూండాగిరి
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శ

టేక్మాల్/అందోల్, సెప్టెంబర్ 26: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలోని టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై గురువారం కాంగ్రెస్‌కు చెందిన సొసైటీ డైరెక్టర్, ఆయన అనుచరుడు దాడికి పాల్పడ్డారు. డైరెక్టర్ అనుచరుడు భూమయ్య సైతం చైర్మన్‌పై దాడికి పాల్పడటంతో నోటి నుంచి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే బాధితులు టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యశ్వంత్‌రెడ్డిపై దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అందోల్ మాజీ ఎమ్మె ల్యే చంటి క్రాంతికిరణ్ డిమాండ్‌చేశారు. జోగిపేటలో యశ్వంత్‌రెడ్డిని ఆయన పరామర్శించారు.

నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- భారీగా పెరగనున్న చార్జీలు
- తుదిదశకు చేరిన థర్డ్ పార్టీ ఏజెన్సీ అధ్యయనం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పనులు ప్రారంభం కావడం, ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల సవరణపైనా అధ్యయనం చేసినట్టు చెప్తున్నారు. వారంరోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనున్నట్టు సమాచారం. ప్రభుత్వం సమీక్ష అనంతరం ఏ స్థాయిలో ధరలను సవరించాలో నిర్ణయిస్తారని చెప్తున్నారు. నవంబర్ మొదటివారంలో పెంపును అమలు చేసే అవకాశం ఉంది. 'ఇది రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కాదు. శాస్త్రీయంగా ధరల స్థిరీకరణ. స్థానిక పరిస్థితులను బట్టి చార్జీలు పెంచాలో, తగ్గించాలో నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది' అని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

బది'లీలల'పై కొరడా?

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని సమాచారం. ఈ బదిలీల్లో అధికార పక్ష నేతలు, ఉన్నతాధికారుల సన్నిహితులకు కోరుకున్న స్థానాలను కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల మేర చేతులు మారినట్టు చర్చ జరిగింది. కొందరు అధికారులే దళారుల అవతారం ఎత్తి పోస్టింగ్‌ల బదిలీలల్లో కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి, సీఎం గుర్రుగా ఉన్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

సహకార డెయిరీలకు సమాధి!

- హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం
- సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు
- శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం
- స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు
- ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం
- అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్ర నష్టం

ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

రైతుల ఆదాయంపై దెబ్బ?

నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందుకెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో-ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టిలేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, మూల్కనూరు డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయిరీల మార్కెట్‌కు దీటుగా పాలసేకరణ ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కావన్నది నిపుణుల అభిప్రాయం. ఆంధ్రాలోని పాడిరైతులకు వచ్చే ఖర్చుతో పోల్చితే.. తెలంగాణలో వాతావారణం, ఇతర మార్పుల నేపథ్యంలో 25 శాతానికిపైగా అదనపు ఖర్చు వస్తుందని పాడిపరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి రైతాంగానికి సరిపడా రేటు గిట్టుబాటు అయ్యేందుకు కావాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిపెటాలన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

యువతిపై ప్రేమోన్మాది దాడి

సాయికుమార్ (ఫైల్)

రామంతాపూర్, సెప్టెంబర్ 26: ఓ యువతిపై ప్రేమోన్మాది దాడి చేసిన ఘటన ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద గురువారం చోటుచేసుకుంది. భువనగిరికి చెందిన రాగల సాయికుమార్(24), ఓ యువతి గతంలో ప్రేమించుకోగా.. మనస్పర్థలు రావడంతో విడిపోయారు. చాలా రోజుల తర్వాత ఈ ఇద్దరూ గురువారం ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద కలుసుకోగా.. తనను ప్రేమించాలంటూ సాయికుమార్ యువతిపై ఒత్తిడి చేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆమెపై కత్తితో దాడిచేశాడు. యువతి వేలికి గాయం కాగా, స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూఎస్‌పీసీ సభ్యులు

రేపు యూఎస్‌పీసీ, ఎస్టీయూ నిరసనలు

- జీవో 25ను సవరించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలిపి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని యూఎస్‌పీసీ, ఎస్టీయూ పిలుపునిచ్చాయి. మరోవైపు జీవో 25లోని నిబంధనలు సవరించాలని కోరుతూ గురువారం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కే జంగయ్య, పీ నాగిరెడ్డి పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రాలు అందజేయగా, ఎస్టీయూ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం సైతం వినతిపత్రం సమర్పించారు.

జైనూర్ ఘటనపై విచారణ చేపట్టాలి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 26: ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఈ నెల 4న జరిగిన ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక, పౌర హక్కుల కార్యకర్తలు ఖలీదా పర్వీన్, సరా మాథ్యూస్, మసూద్, ప్రొఫెసర్ పద్మజాషాతో కలిసి మాట్లాడారు. జైనూరులో ఉద్దేశపూర్వకంగానే ఒక వర్గంపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సగం చేపపిల్లలకు సర్కారు కోత

- తొలుత 85 కోట్ల పిల్లల పంపిణీకి ఏర్పాట్లు
- టెండర్ల సమయానికి 40కోట్లకే పరిమితి
- కాంగ్రెస్ ప్రభుత్వం నిధులవ్వకనే ఈ దుస్థితి
- నాలుగుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు
- బకాయిలపై ప్రశ్నించిన రైతులకు బెదిరింపులు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం కోత పెట్టింది. సగానికి సగం కోత పెట్టిన ప్రభుత్వం 50శాతం చేపపిల్లల్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తొలుత 85 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రణాళికలు రూపొందించిన మత్స్యశాఖ.. టెండర్ల సమయానికి 40 కోట్లకే పరిమితం చేసింది. చేపపిల్లల పంపిణీలో కోతకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నిధులతో 40కోట్లు పంపిణీ చేస్తామని, ప్రభుత్వం నిధులిస్తే మిగిలిన సగం పంపిణీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతియేట 80 కోట్ల చేపల పిల్లల్ని, మరో 10 కోట్ల రొయ్య పిల్లల్ని పంపిణీ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదే చేపపిల్లల పంపిణీకి కోత పెట్టడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగుసార్లు టెండర్లు పిలిచినా...

ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఆపసోపాలుపడుతున్నది. జూలై 9నుంచి నేటి వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. రెండున్నర నెలల్లో నాలుగుసార్లు టెండర్లు పిలిచినా పంపిణీదారుల నుంచి స్పందన కరువైంది. గతేడాది బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఇవ్వకపోవడంతో పంపిణీదారులు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు ఇస్తేనే టెండర్లలో పాల్గొంటామని పంపిణీదారులు చెబుతున్నారు. తొలుత పిలిచిన టెండర్‌లో ఒకే ఒక దరఖాస్తురాగా, రెండోసారికి 4దరఖాస్తులు వచ్చాయి. మూడోసారి 27వరకు దరఖాస్తులు వచ్చినట్టుగా తెలిసింది. ఇందులో కొంతమందికి వెరిఫికేషన్‌లో చేపల చెరువులు లేకపోవడంతో వారిని తిరస్కరించారు. ఇప్పుడు 19 జిల్లాలకు దరఖాస్తులు ఒకే కాగా 12 జిల్లాలకు మళ్లీ దరఖాస్తులు పిలిచారు. వీటి ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.

బ్లాక్‌లిస్టులో పెడుతాం

చేపల పంపిణీ రైతులపై మత్స్యశాఖలోని అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత పంపిణీదారు రైతులను పిలిపించిన అధికారులు.. వారం పది రోజుల్లో బకాయిలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి టెండర్లలో పాల్గొనాల్సిందిగా కోరినట్టు ఓ పంపిణీదారు తెలిపారు. అధికారుల హామీతో టెండర్లలో పాల్గొన్నామని, పదిహేను రోజులు గడిచినా బకాయిల ఊసెత్తడంలేదని తెలిపారు. దీనిపై అధికారులను ఆరా తీస్తే.. బకాయిలు ఇచ్చే పరిస్థితిలేదని, టెండర్‌లో ఎంపికైన వాళ్లు అగ్రిమెంట్ చేసుకోవాలని ఆదేశించినట్టుగా తెలిసింది. రైతులు అగ్రిమెంట్‌కు నిరాకరించగా 'మీ బకాయిలు ఎలా వస్తాయో చూస్తాం. మీ డిపాజిట్ డబ్బులను బ్లాక్ చేస్తాం. మళ్లీ టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్టులో పెడతాం' అంటూ బెదిరించినట్టుగా ఓ పంపిణీదారు ఆవేదనను వ్యక్తం చేశారు.

పంపిణీ ఇంకెప్పుడు ?

ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభంకావాల్సిన చేపల పంపిణీ ప్రక్రియ సెప్టెంబర్ పూర్తవుతున్నా టెండర్ దశలోనే ఉంది. పంపిణీ ఆలస్యమవుతుండడంతో ఏప్రిల్ వరకు చెరువులు, కుంటల్లో నీళ్లు తగ్గి చేపలు ఆశించిన స్థాయిలో పెరుగవని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాలుగైదేండ్లుగా పుష్కలమైన చేపలను విక్రయించి ఆర్థికంగా భరోసా దక్కిందని, ఇప్పుడు పంపిణీ ఆలస్యం అవుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా 50శాతం పంపిణీ నిర్ణయాన్ని విరమించుకొని 100శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.